సాక్షి పెద్దపల్లి

శనివారం । 10 । జూన్ । 2023



పత్తి క్వింటాలు ధర రూ.6,895

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో శుక్రవారం పత్తి క్వింటాలు ధర గరిష్టంగా రూ.6,895 పలికింది.



ఉద్యోగ మేళాకు స్పందన

విదేశాల్లో ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో రామగుండంలోని ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన విదేశీ ఉద్యోగ మేళాకు స్పందన వచ్చింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
40.0/30.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మా భూములు మాకే కావాలి



ధర్నా నిర్వహిస్తున్న ఎక్లాస్‌పూర్ వాసులు

మంథని: ప్రభుత్వం 36 ఏళ్ల క్రితం తమకు పంచిన భూములను రద్దు చేసి వేరే వారికి కట్టబెట్టే ప్రయత్నం సరికాదని, ఆ భూములు మాకే ఉంచాలని మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామస్తులు వేడుకున్నారు. శుక్రవారం మంథని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మా భూములు మాకే కావాలంటూ నినాదాలు చేశారు. నిరుపేదలమైన మాకు అన్యాయ చేయవద్దని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1987లో ఎక్లాస్‌పూర్ శివారులోని సర్వే నం.32/123లో నివేశనస్థలాలకు పంటాలు పంపిణీ చేశారన్నారు. అప్పటి నుంచి భూమిని చదును చేసుకొని కాపాడుకుంటున్నామని, కానీ వాటిని రద్దు చేసి మాకు కాకుండా చేస్తే మా బతుకులు ఆగమవుతాయని తెలిపారు. సెంటు భూమి కూడా లేని తాము పూరి గుడిసెల్లో నివాసముంటున్నామని తమ బాధలు అర్థం చేసుకొని న్యాయం చేయాలని కోరారు. గతంలో ఇచ్చిన పట్టాలను కొనసాగించి ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతించాలని అన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ డీఏవో తూము రవీందర్‌కు వినతిప్రతం అందజేశారు.

తూకంలో మోసం చేస్తే చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న విశ్వేశ్వర్

పెద్దపల్లిరూరల్: తూకంలో మోసాలకు పాల్పడ్డ, నిబంధనలకు విరుద్ధంగా వస్తువులను అమ్మినా చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి విశ్వేశ్వర్ అన్నారు. జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, ఎలిగేడు మండలాల్లో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి మూడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేసే వ్యాపారులపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు.

'గీతబంధు' ప్రకటించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న గీతకార్మికులు

పెద్దపల్లిరూరల్: చేతివృత్తులు, కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గీత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆల్ ఇండియా గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు బుషణవేణ రమేశ్‌గౌడ్ అన్నారు. పెద్దపల్లి శివారు ఎల్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం గీత కార్మికులు తాటిచెట్టు పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ కుటుంబపోషణ కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి తాటిచెట్టు ఎక్కి కల్లు గీసే కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. గీతబంధు ప్రకటించి చేసి రూ.లక్ష సాయం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజేందర్, శ్రీనివాస్, కనకయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఈనెల 12 నుంచి 20 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు నోడల్ అధికారి కల్పన తెలిపారు. జిల్లావ్యాప్తంగా 6,381 మంది విద్యార్థులు (4,126 ఫస్టియర్, 2,255 సెకండియర్) హాజరయ్యేందుకు వీలుగా 16 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించేందుకు ఫ్లయింగ్‌స్క్వాడ్, రెండు స్విట్టింగ్‌స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు.

నేడు ఆర్‌అండ్‌బీ కార్యాలయం ప్రారంభం

సుల్తానాబాద్: రహదారుల విస్తీర్ణత పెరుగుతుండడంతో నిర్మాణల పర్యవేక్షణకు కొత్తగా సుల్తానాబాద్‌లో రోడ్లు భవనాల అతిథి గృహం సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సుపరిపాలన పేరిట చేపట్టే కార్యక్రమంలో కొత్తగా ఏర్పడిన రహదారుల భవనాల శాఖ సబ్ డివిజన్ భవనాన్ని శనివారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మక్క రైతులకు చిక్కులు



జూలపల్లిలో మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)



- ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు జూలపల్లి మండలానికి చెందిన సిరికొండ కొమురయ్య. తనకున్న ఎకరం భూమిలో మొక్కజొన్న పంట సాగు చేశాడు. అయితే పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోలేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో పోస్తే, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారి పంటను మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 20రోజులు గడిచిన రెండుమూడు లారీలు కొనలే. లారీ కిరాయి రైతులే కట్టాలని, పంట పైసలు 45 రోజుల తర్వాత పడుతున్నాయని తెలుపుతుండటంతో పైసలు అవసరమై ప్రైవేట్‌కు అమ్ముకున్నాడు. ఇది ఈ ఒక్క రైతు సమస్యే కాదు జిల్లాలో చాలా మంది మొక్కజొన్న రైతుల పరిస్థితి ఇలానే ఉంది.

- ఆన్‌లైన్‌లో నమోదు చేయక..
- పంట అమ్ముకోలేని పరిస్థితి
- ఆన్‌లైన్‌లో ఉన్న రైతుల మక్కలే కొంటున్న సర్కార్
- తక్కువ ధరకు ప్రైవేటుగా అమ్ముకోవాల్సిన పరిస్థితి

సాక్షి,పెద్దపల్లి: ప్రకృతి ప్రకోపం, వ్యాపారులు, దళారుల మాయ వెరసి మొక్కజొన్న రైతు నష్టపోతున్నాడు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందటం లేదు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్లు ఆలస్యంగానైనా చేపడతున్నా ఆన్‌లైన్ చేసిన రైతుల నుంచే పంటను కొనుగోలు చేస్తుంది. అయితే తెలియక ఆన్‌లైన్ చేసుకోని రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల కొర్రీలతో ప్రైవేట్‌కే అమ్ముకోవాల్సిన పరిస్థితి జిల్లాలో నెలకొంది. మొక్కజొన్నలో తేమ శాతం అధికంగా ఉందని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తిరస్కరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోని యంత్రంతో తేమ శాతం పరిశీలిస్తే 17.5శాతం వరకు వస్తుండగా, అదే పంటను ప్రైవేటు వ్యాపారుల వద్ద ఉన్న యంత్రంతో పరిశీలిస్తే 14.5 వస్తోందని ఈ తిరకాసు అర్థం కావటం లేదని రైతులు చెబుతున్నారు. నిబంధనల మేరకు ఉన్నా ప్రభుత్వ కొనుగోలు కేంద్రం నిర్వహకులు ఎందుకు కొనుగోలు చేయటం లేదో అర్థం కావటం లేదని అన్నదాతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యం కారణంగా పంట పూర్తిగా ఎండి తక్కువ బరువు వల్ల నష్టపోవాల్సి వస్తోందని, దీంతో ఆర్థిక అవసరాలు, అత్యవసరానికి దళారులకు క్వింటాల్ పై రూ.200 నుంచి రూ.300 వరకు తగ్గించి అమ్ముకోవాల్సి వస్తోందంటున్నారు.

అంతా పథకం ప్రకారమే

ప్రభుత్వం మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన, వివిధ కొర్రీలతో కొనుగోళ్లు చేపట్టకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు తమకు ఇష్టమొచ్చిన ధరకు కొంటున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో అన్నదాతలు వారికే విక్రయిస్తున్నారు. తక్కువ ధరతో పాటు హమీలీ కూలీల కింద క్వింటాల్ మొక్కజొన్నకు రూ.30 తీసుకుంటుండగా, బస్తాకు క్వింటాల్‌కు 2కిలోల తరుగు అదనంగా తీసేస్తున్నారు. మొక్కజొన్న పంట పండించిన రైతులు ప్రైవేటులో అమ్ముకుని ఆర్థికంగా నష్టపోతున్నా సంబంధితశాఖల అధికారులు మౌనంగా ఉండటం గమన్హారం. ప్రైవేటు వ్యాపారులు నిబంధనల పక్కన పెట్టి ఇష్టారీతిన ధర చెల్లిస్తూ రైతులను మోసం చేస్తున్నా అధికారులు ప్రైవేటు వైపు చూసీచూడనట్లు 'మామూలుగా' వ్యవహరిస్తున్నరనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై మార్క్‌ఫెడ్ అధికారులను వివరణ కోరగా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, దళారులకు అమ్ముకోవద్దని సూచిస్తున్నారు.

3.02లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడులు

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో మొక్కజొన్న 11,647 ఎకరాల్లో సాగు చేశారు. పంటల విస్తీర్ణానికి తగ్గట్టుగా వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖతో పాటు రైతులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా 302715 క్వింటాళ్ల మొక్కజొన్న పంట దిగుబడి వస్తుందని అంచనా వేశారు. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 12653 క్వింటాల మొక్కజొన్నలను మాత్రమే కొనుగోలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈసీజన్‌లో క్వింటాల్ మక్కలకు రూ. 1962 మద్దతు ధర ప్రకటించింది. కానీ ప్రైవేటు వ్యాపారులు మక్కకు రూ. 1700మించి పెట్టడం లేదు. దీంతో ప్రభుత్వం ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన మక్కలు ఎకరాకు 26.80 క్వింటాళ్లు మాత్రమే సేకరించాలని నిర్ణయించటంతో మిగిలిన పంటను ఏంచేయాలో తెలియక అన్నదాతలు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకం



మాట్లాడుతున్న శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు

- పాపాయి మొదలు పండు ముదుసలి వరకు లబ్ధి
- అర్హులందరికీ భరోసా ఇస్తున్న కేసీఆర్ సర్కార్
- శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం ప్రతి ఇంటికి, పాపాయి మొదలు.. పండు ముదుసలి వరకు సంక్షేమ పథకం అందేలా రూపకల్పన చేసి అమలు చేస్తోందని శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు అన్నారు. రాష్టావతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పెద్దపల్లిలో జిల్లా సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన సంక్షేమ సంబురాలు కార్యక్రమంలో కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి.. అందిన సంక్షేమ పథకాల ఫలాలు.. ప్రత్యేక రాష్ట్రంలో అందుతున్న వాటిని పోల్చి చూసుకుంటే మనమెంత అభివృద్ధి చెందామో అర్థమవుతోందన్నారు. పేదలపై ఆర్థిక భారం పడొద్దని ఆడపిల్ల పెళ్లికి కళ్యాణలక్ష్మి పథకం, గర్భిణులు ప్రసూతి సేవల కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అవస్థలు పడొద్దని ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో మాతాశిశు ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. పుట్టిన పాపాయికి కేసీఆర్ కిట్ ఇలా చెప్పుకుంటూ పోతే పథకాల జాబితా చాలా ఉందన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ నెంబర్‌వన్ స్థానంలో ఉందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పారిశ్రామిక, ఐటీరంగం అభివృద్ధితో తలసరి గణనీయంగా పెరిగి దేశంలో అగ్రస్థానంలో ఉన్నామన్నారు.

అర్హులందరికీ పథకాల ఫలాలు: కలెక్టర్ సంగీత

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను అర్హులందరికీ అందిస్తున్నామని కలెక్టర్ సంగీత అన్నారు. గతంలో ఫించన్లు 61,953 మందికి ఇస్తే ఇప్పుడు 97,752 మందికి రూ.21.79లక్షలు అందిస్తున్నామని తెలిపారు. మహిళారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి వారికోసం ఆరోగ్య మహిళ కార్యక్రమం చేపట్టిందన్నారు. అనంతరం కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లిలో 29మంది, సుల్తానాబాద్ మండలం రెబ్బల్‌దేవ్‌పల్లిలో 7గురికి ఇంటిస్థలాల పట్టాలు పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, జెడ్పీ వైస్‌చైర్మన్ రేణుకతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

సంక్షేమానికే ప్రాధాన్యం

మంథని: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజల బాగోగులు ఏ మాత్రం పట్టించుకోవాలని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో నేడు అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. శుక్రవారం మంథనిలోని ఎస్ఎల్‌బీ గార్డెన్‌లో నిర్వహించిన సంక్షేమ వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్, మైనార్టీ, ఎస్సీ, గిరిజన, బీసీ కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం ఆయా శాఖల ఆధ్వర్యంలో పలువురికి చెక్కులు, బ్యాటరీ సైకిళ్లు పంపిణీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్, తహసీల్దార్ బండి ప్రకాశ్, ఎంపీడీవో రమేశ్, డివిజన్‌లోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం

గోదావరిఖని: సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా తెలంగాణా రాష్ట్రం నిలుస్తోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ సంక్షేమ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 364 సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్లు శ్రీనివాస్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

ప్రాజెక్టుల జీవిత కాలం పెంచేందుకు సన్నాహాలు

గోదావరిఖని: సింగరేణిలో నూతన ప్రాజెక్టుల జీవిత కాలం పెంచేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని సింగరేణి డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్వీకే శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆర్జీ-1 జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ ద్వారా నూతన ప్రాజెక్టులు, బొగ్గు గనుల వాటి జీవిత కాలం పొడగించడానికి అవసరమైన అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 2023-24 లో ఐదు కొత్త ప్రాజెక్టుల ఏర్పాటు కోసం ఏరియాల వారీగా ఉన్న పూర్తి సమాచార నివేదికను సమగ్రంగా తెలియజేయలని ఆదేశించారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరంలో మరో మూడు నూతన ప్రాజెక్టులు నెలకొల్పేలా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. బొగ్గు నిల్వల కొరకు నూతన సాంకేతికతో గనుల జీవిత కాలం పొడిగింపు దిశగా ప్రణాళికలు చేయాలన్నారు. రానున్న కాలంలో భూగర్భ గనుల్లో ఏమేరకు బొగ్గు నిల్వలు ఉన్నాయి? ఏరియాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను తెలియజేయాలని కోరారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డైరెక్టర్లు

గొల్ల, కుర్మలు ఆర్థికంగా ఎదగాలి



గొర్రెపిల్లలను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: గొల్ల, కుర్మలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో శుక్రవారం మలివిడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గొల్ల, కుర్మలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం రాయితీపై గొర్రెలను అందిస్తోందని అర్హులైన వారందరిలో సగం మందికి తొలివిడతలో పంపిణీ చేశామని, రెండో విడతలో మిగతా వారందరికీ అందిస్తామని తెలిపారు. గొర్రెల పెంపకం వల్ల గొర్రెల సంపద పెరిగి స్థానిక అవసరాలకనుగుణంగా మాంసం ఉత్పత్తులు పెరిగాయన్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రఘువీర్‌సింగ్, జెడ్పీటీసీ రామ్మూర్తి, ఏడీ రవీందర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ పనులు పరిశీలన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ప్రగతినగర్ ప్రాంతంలో చేపట్టిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ పనులను శుక్రవారం ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి పరిశీలించారు. కార్యాలయ పనుల వివరాలను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, సంబంధిత అధికారుల నుంచి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ రామ్మూర్తితో పాటు పలువురు పాల్గొన్నారు.



పాఠ్య పుస్తకాలొచ్చాయ్


పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పాఠశాలలన్నీ ఈనెల 12 నుంచి పునః ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ పాఠశాల ప్రారంభం రోజునే పుస్తకాలు అందుబాటులో ఉంచేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని 638 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 2,54,880 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా ఇప్పటివరకు 2,17,010 పుస్తకాలు చేరాయి. మిగతా పుస్తకాలు రెండు, మూడు రోజుల్లో వస్తాయని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 1,35, 355 పుస్తకాలను ఆయా మండలాలకు పంపించా మని విద్యాశాఖ కార్యాలయ వర్గాలు తెలిపాయి. పెద్దపల్లి మండలంలోని పాఠశాలలకు అవసరమైన 74వేల పాఠ్యపుస్తకాలు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాల కొరత లేకుండా చూస్తామని జిల్లా విద్యాధికారి మాధవి పేర్కొన్నారు.



జగిత్యాల జిల్లాలో

ఫుడ్ ప్రాసెసింగ్ హబ్

- 195 ఎకరాల్లో భారీ స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్
- మెట్‌పల్లి సమీపంలో 40 పరిశ్రమల కోసం నదుపాయాలు
- రూ.40 కోట్లతో టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో పనులు
- అక్టోబరు ఒకటిన సీఎం లేదా కేటీఆర్ చేత పనులు ప్రారంభం
- జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులపై కన్ను
- ఇప్పటికే ఆసక్తి చూపించిన భువి, ధాత్రి సంస్థలు
- కరోనా, ఉక్రెయిన్ సంక్షోభాలతో వ్యవసాయోత్పత్తులకు డిమాండ్



మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ ఫుడ్ ప్రాసెస్ జోన్ ప్లాన్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో భారీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ రానుంది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్ వద్ద ×స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్*ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. కరోనా, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తులకు పెరిగిన డిమాండ్‌ను అనుకూలంగా మలుచుకునే యోచనలో తెలంగాణ సర్కారు ఉంది. అందుకే, ఈ ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్ కోసం.. 195 ఎకరాల భూమిని కేటాయించింది. ఎంపిక చేసిన భూమిలో మౌలిక సదుపాయాల కల్పనలో తలమునకలైంది. ఈస్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో కీలకమైన రోడ్లు, విద్యుత్తు, నీరు తదితర ముఖ్యమైన మౌలిక సదుపాయాలు కీలకం. అందుకే వీటిని వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాల సంస్థ(టీఎస్ఐఐసీ) పట్టుదలగా ఉంది. పార్క్ అభివృద్ధికి సంబంధించిన బ్లూప్రింట్ ప్రకారం వసతులు కల్పిస్తోంది.

రూ.40 కోట్లతో సదుపాయాలు..

మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ ప్రాంతం భౌగోళికంగా ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు మధ్యలో ఉంది. అందుకే ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్ పారిశ్రామిక అవసరాలకు కావాల్సిన నీటిని అందించేందుకు వరద కాల్వ, సరుకు రవాణాకు రోడ్డు, రైలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా.. వ్యవసాయంపరంగా ఈ మూడు పాత జిల్లాల్లో కరీంనగర్‌లో వరి, మొక్కజొన్న, మామిడి, నిజామాబాద్‌లో చెరుకు, మొక్కజొన్న, పసుపు, ఆదిలాబాద్‌లో వరితోపాటు పత్తి బాగా పండుతాయి. ఈ పంటలతోపాటు వాటి ద్వారా ఉత్పత్తి అయ్యే బై ప్రోడక్టులను సద్వినియోగం చేసుకోవాలన్న ఉద్దేశంతో ఈ ప్రాంతంలో స్పెషల్ ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 194.67 ఎకరాల్లో రూ.40 కోట్ల నిధులతో ఇక్కడ 'స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్' నిర్మిస్తారు. ప్రస్తుతం ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ కోసం ఎంపిక చేసిన ప్రాంతంలో టీఎస్ఐఐసీ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సమాయత్తం అవుతోంది. ప్రధానంగా విద్యుత్తు, రోడ్లు, నీరు తదితర సదుపాయాలకు కావాల్సిన పనులను చేపడుతోంది. ఈ పార్క్ నిర్మాణ పనులు అధికారికంగా అక్టోబరు ఒకటిన ప్రారంభం కానున్నాయి.

పెట్టుబడులు ఆకర్షించేలా..

ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో ఉన్న భూమిలో ప్లాటింగ్ కోసం ప్లాన్ గీశారు. స్థానిక వ్యవసాయ ఉత్పత్తుల లభ్యత ఆధారంగా జాతీయ, అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించే పనిలో పరిశ్రమలశాఖ ఉంది. అందుకు అనుగుణంగా దాదాపు 40 వరకు చిన్న, పెద్దతరహా పరిశ్రమల కోసం కనిష్టంగా రెండు ఎకరాల నుంచి గరిష్టంగా పది ఎకరాల వరకు పరిశ్రమలు స్థాపించుకోవచ్చు. ఆ విధంగా ప్లాటింగ్‌ను మార్కింగ్ చేసిన టీఎస్ఐఐసీ అధికారులు.. పరిశ్రమ సామర్థ్యాన్ని బట్టి ఇందులో మార్పులు కూడా చేసే వీలుందని తెలిపారు. అందులో భాగంగానే ఇక్కడ ఇథనాల్ తయారీ పరిశ్రమల ఏర్పాటుకు పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పార్క్ ఏర్పాటును పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తొలిసారిగా ప్రకటించారు. అదే సమయంలో భువి కెమికల్స్ ఆధ్వర్యంలో రూ.1,040 కోట్ల వ్యయంతో రోజుకు లక్ష లీటర్ల ఇథనాల్ సామర్థ్యంతో ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఆసక్తి చూపించింది. ధాత్రి బయో సొల్యూషన్స్ ఆధ్వర్యంలో సిలికా ఉత్పత్తి కోసం రూ.160 కోట్ల వ్యయంతో పరిశ్రమ స్థాపించేందుకు ఆసక్తి కనబరిచారు. దీనితోపాటు బయోగ్యాస్ ఉత్పత్తి చేయాలన్న ఆలోచనలో ఉన్నారని సమాచారం.

ఇక్కడే ఎందుకు?

ఉమ్మడి రాష్ట్రం ఏర్పాటు నుంచే కరీంనగర్ జిల్లా వరి ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత వరి ఉత్పత్తి మరింత పెరిగింది. కరీంనగర్ జిల్లాలో 2.71 లక్షల ఎకరాలు, సిరిసిల్లలో 1.71 లక్షల ఎకరాలు, పెద్దపల్లిలో 2 లక్షల ఎకరాలు, జగిత్యాల జిల్లాలో దాదాపుగా 2.97 ఎకరాలు మొత్తంగా 9.39 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఈ జిల్లాల్లో దాదాపు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు ఉత్పత్తి అవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఇథనాల్‌ను వరిగడ్డి, నూకలు, చెరుకు, మొక్కజొన్న నుంచి తీస్తారు. దీంతో మెట్లచిట్టాపూర్ పరిసర జిల్లాల నుంచి ఉత్పత్తి అయిన ప్రతీ వ్యవసాయ ఉత్పత్తిని ఇక్కడ ప్రాసెస్ చేసేందుకు లేదా ఇథనాల్ తదితరాలు ఉత్పత్తి చేసేందుకు ఉపయోగపడుతాయి. కరోనా సంక్షోభం, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత దేశంలో వరి, నూకలు, తౌడు, ఉనుకకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. ఈ పరిస్థితిని తెలంగాణ ప్రభుత్వం అనుకూలంగా మార్చుకునే యోచనలో ఉంది. అంతేకాకుండా వరి ధాన్యాన్ని ఆడించగా వచ్చే ఉనుక, తౌడు, పరం తదితరాలతోనూ ఇక్కడ బ్రాన్ ఆయిల్, బిస్కట్ తదితర పరిశ్రమలను సైతం నిర్మించవచ్చు.

క్లుప్తంగా

గోపరపల్లె చెరువును పర్యాటక కేంద్రంగా మార్చాలి


గెల్లు శ్రీనివాస్‌కు నాయకుల వినతి

ఓదెల: మండలంలోని గోపరపల్లె చెరువును పర్యాటక కేంద్రంగా మార్చాలని బీఆర్‌ఎస్‌వీ నాయకుడు కాశవేని నరేశ్ శుక్రవారం టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల శ్రేయస్సు కోసం చెరువును అభివృద్ధి చేయాలన్నారు. చెరువు ఎండిపోకుండా నిండుకుండలా ఉంటుందని, తీగల వంతెనతో పాటు బోటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు జీల రాజేందర్, కొండా రాజుయాదవ్, పలనూరు అంజయ్య పాల్గొన్నారు.

బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య



ధర్మారం: ధర్మారం మండలం నర్సింహులపల్లికి చెందిన దీటి మల్లమ్మ (80) ఒంటరితనం భరించలేక శుక్రవారం తెల్లవారుజామున వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ధర్మారం ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లమ్మ కొంతకాలంగా ఒంటరితనం, అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుమారుడు దీటి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

గుంపులలో చోరీ


బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ

ఓదెల: మండలంలోని గుంపుల గ్రామంలో దుమ్మని వెంకటేశం ఇంట్లో గురువారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. పొత్కపల్లి ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశం గురువారం రాత్రి 10 గంటలకు బిజిగిరిషరీఫ్‌లోని తన బంధువుల పెళ్లికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లారు. తాళం వేసిన ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువాలోని ఎల్ఐసీ డబ్బులు రూ.1.50లక్షలు, ఆరు తులాల బంగారం, 8 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. పెళ్లికి వెళ్లి శుక్రవారం ఉదయం 6గంటలకు వచ్చే సరికి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి బీరువా తెరిచి వస్తువులు చిందరవందర ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు క్లూస్ టీంతో వేలిముద్రలు సేకరించారు. నిందితులను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

నూతన ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష

కమాన్‌పూర్: ఆర్జీ–3లో నూతన ప్రాజెక్టుల పురోగతిపై శుక్రవారం డైరెక్టర్లు(ప్రాజెక్ట్స్) అండ్ ప్లానింగ్ జి.వెంకటేశ్వరరెడ్డి, ఎన్‌వీకే శ్రీనివాస్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలో అభివృద్ధి, పురోగతి పనులపై సమీక్షించారు. నూతనంగా చేపట్టిన పనులను త్వరిగతిన పూర్తి చేసి బొగ్గు ఉత్పత్తి చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆర్జీ–3 జీఎం మనోహర్, ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు, ఏపీఏ ఎస్‌వోటూ జీఎం బైద్య, ఓసీపీ–1 పీవో రాధాకృష్ణ, ఐఈడీడీ జీఎం చంద్రశేఖర్, ఎస్టేట్స్ అధికారి ఐలయ్యలు పాల్గొన్నారు.

విదేశీ ఉద్యోగ మేళాకు స్పందన

- నాలుగు జిల్లాల నుంచి హాజరైన 130 మంది
- ప్రత్యేక ఇంటర్వ్యూ అనంతరం వివరాల నమోదు
- వారం రోజుల్లో సమాచారమిస్తామని వెల్లడి


ఉద్యోగ మేళాకు హాజరైన నిరుద్యోగులు

రామగుండం: విదేశాల్లో ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో రామగుండంలోని ఐటీఐలో శుక్రవారం ఏర్పాటు చేసిన విదేశీ ఉద్యోగ మేళాకు స్పందన వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కాం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు నాలుగు జిల్లాల నుంచి 130 మంది హాజరయ్యారు. వీరికి ప్రత్యేక ఇంటర్వ్యూ నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. వారం రోజుల్లోగా సమాచారం ఇస్తామని వెల్లడించారు.

ఇంటర్వ్యూలు నిర్వహించిన ఉద్యోగాల వివరాలు..

ఆస్ట్రేలియాలో ప్లాంట్ మెకానిక్, మెకానికల్ ఫిట్టర్, మెకానికల్ ఇంజినీర్, వెల్డర్, బైలర్ మేకర్, ఫ్యాబ్రికేటర్, జర్మనీలో ఆస్‌బిల్డింగ్ ప్రోగ్రామ్స్, కన్‌స్ట్రక్షన్స్, ఫుడ్ ప్రాసెసింగ్ (నాన్ వెజ్), రిటైల్ సేల్స్, వేర్‌హౌస్ క్లర్క్, ట్రక్ డ్రైవర్స్, వెసెల్ కంటైనర్ మేకింగ్, పోలాండ్‌లో వెల్డర్స్, ఫిట్టర్స్, యూఏఈలో ఫోర్‌మెన్ ప్లాంటర్, మెషినిస్ట్, మెకానికల్, వర్క్ ప్రిపరేటర్ పైపింగ్, వర్క్ ప్రిపరేటర్–స్ట్రక్చరల్, ఫోర్‌మెన్ రబ్బర్ ప్రొపెల్లర్, ప్లాటర్ ఫ్యాబ్రికేటర్, పైపింగ్ సూపర్‌వైజర్, బ్లాస్టింగ్, వెల్డర్, ఫోర్‌మెన్ మెకానికల్ తదితర ఖాళీలకు ఇంటర్వ్యూ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు.

అబ్రాడ్‌లో ఉద్యోగం చేయాలని..



నేను డిగ్రీ చదివా. ప్రస్తుతం హెవీ వెహికల్ డ్రైవర్‌గా పనిచేస్తున్న. ఉద్యోగం చేయాలనే కోరిక ఉంది. పత్రికల్లో వచ్చిన ప్రకటనను చూసి ఇంటర్వ్యూకు వచ్చా. ధ్రువీకరణపత్రాలు సమర్పించ. మూడురోజుల్లో కాల్ చేస్తామన్నారు. – ఎండీ.సాజిద్ అహ్మద్, మంచిర్యాల

ఆస్ట్రేలియాలో ఉద్యోగం కోసం..



నేను మైనింగ్‌లో ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేశా. ప్రస్తుతం ప్రైవేటుగా జాబ్ చేస్తున్న. విదేశాల్లోని మైనింగ్ కంపెనీల్లో ఉద్యోగం చేయాలని ఉంది. టామ్‌కాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరయ్యా. ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేయాలనే విషయాన్ని వారికి తెలిపా. – శ్రీవెంకటేశ్వర, గుంజపడుగు, పెద్దపల్లి జిల్లా

ఆఫ్రికాలో ఉద్యోగం కల్పించాలని..



నేను ఐటీఐలో ఫిట్టర్ పూర్తి చేసి గోదావరిఖనిలో అప్రెంటిషిప్ చేస్తున్న. విదేశాల్లో ఉద్యోగ ప్రకటన చూసి ఇంటర్వ్యూకు వచ్చా. పెళ్లికి ముందే ఐదేళ్లు విదేశాల్లో ఉద్యోగం చేసి వస్తే ఆర్థికంగా బాగుంటుంది. ఆఫ్రికా దేశంలో ఉద్యోగం కల్పించాలని కోరా. – బండారి అవినాశ్, ఖమ్మం

ఇంటర్వ్యూకు రావడం మొదటిసారి



నేను ఐటీఐలో ఎలక్ట్రిషియన్ పూర్తి చేసి మంచిర్యాల సింగరేణి కాలరీస్‌లో అప్రెంటిషిప్ చేస్తున్న. నా అర్హతకు సంబంధించి ఆస్ట్రేలియా, జర్మనీ దేశాల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలకు దరఖాస్తు చేశా. అబ్రాడ్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూకు రావడం ఇదే మొదటిసారి. – తుమ్మ వైష్ణవి, మంచిర్యాల

తగిన ఉద్యోగం వస్తే చాలు



నేను బీఎస్సీ (ఎంసీసీఎస్) చదివా. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఏజెన్సీ టామ్‌కాం కావడంతో నమ్మకంతో విదేశాల్లో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేందుకు వచ్చా. వివరాలన్నీ నమోదు చేసుకొని పది రోజుల్లోగా సమాచారం ఇస్తామన్నారు. – మేర్గు సాగర్‌గౌడ్, పెద్దంపేట, పెద్దపల్లి జిల్లా

15 ఏళ్లు అరబ్ దేశాల్లో పనిచేశా



నేను పదిహేనేళ్లు వివిధ అరబ్ దేశాల్లో పనిచేసి కొన్ని పనుల నిమిత్తం ఇండియాకు తిరిగి వచ్చా. ప్రస్తుతం నాన్ అరబ్ దేశాల్లో ఉద్యోగం చేయాలని నిర్ణయించుకున్న. నా అర్హత, విదేశాల్లో చేసిన పనులు తదితర ధ్రువీకరణపత్రాలు అందజేశా. – ఎండీ.సాధిఖ్, సిరిసిల్ల

అర్హతలున్న వారందరికీ ఉద్యోగం కల్పిస్తాం



ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హతలున్న వారందరికీ విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. మేళాకు వచ్చిన వారి నుంచి స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తాం. పరిశీలించి మళ్లీ ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తాం. విదేశాల్లో ఉద్యోగం చేయాలనుకునే వారు ప్రయివేటు కన్సల్టెంట్లను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వ పక్షాన నిర్వహించే మేళాకు హాజరైతే తక్కువ ఖర్చుతో వెళ్లొచ్చు. – శ్రావణి తలశిల, హెచ్ఆర్ మేనేజర్, టామ్‌కాం

ఏడాది దాటాక ఎంక్వైరీ ఎలా?

- మంథని సబ్ ట్రెజరీ కార్యాలయంలో జేడీ విచారణ
- కార్యాలయ ఉద్యోగిపై అనేక ఆరోపణలు
- ఉన్నతాధికారుల ఉదాసీనతపై విమర్శలు


మంథని సబ్ ట్రెజరీ కార్యాలయం

మంథని: మంథని సబ్ ట్రెజరీ కార్యాలయ ఉద్యోగులపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులు ముట్టనిదే ఫైల్ ముందుకు కదలదనే నానుడి ఇక్కడ కొంతకాలంగా కొనసాగుతోంది. కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి అన్నీ తానై వ్యవహరిస్తూ పెద్ద మొత్తంలో వసూళ్లతో పాటు కార్యాలయానికి వచ్చే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. సదరు ఉద్యోగిపై గతేడాది మేలో ఫిర్యాదులు వెళ్లగా అధికారులు సరిగ్గా ఏడాది దాటిన తర్వాత శుక్రవారం మంథనిలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో విచారణ చేపట్టడంపై విమర్శలు ఎదురవుతున్నాయి. కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి గతేడాది మే 22న ఓ వసతి గృహ ఉద్యోగిపై అనుచితంగా ప్రవర్తించాడనే ఫిర్యాదు వెళ్లింది. దీంతో ట్రెజరీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ ప్రభ, మరో అధికారి నాగరాజు, కార్యాలయ ఉద్యోగులతో పాటు బాధితులను కార్యాలయంలో విచారించారు. మూడు గంటలకు పైగా సాగిన విచారణలో మీడియాను అనుమతించకుండా రహస్యంగా విచారణ చేపట్టారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. సుదీర్ఘకాలంగా కాలంగా పనిచేస్తున్న సదరు ఉద్యోగిపై అనేక ఆరోపణలు, మహిళల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నాడనే ఫిర్యాదులు వచ్చినా ఉన్నతాధికారులు ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పైగా ఏడాది తర్వాత విచారణ ఏంటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు ఉద్యోగి అప్పటి నుంచి ఇదే కార్యాలయంలో విధులకు హాజరు కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అబ్బాపూర్‌లో అగ్నిప్రమాదం

పశువుల కొట్టం, పశుగ్రాసం, వడ్లు దగ్ధం


కొనుగోలు కేంద్రంలో చెలరేగుతున్న మంటలు

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి పశువుల కొట్టం, పశుగ్రాసం, కొనుగోలు కేంద్రంలోని వడ్ల కుప్పలు దగ్ధమయ్యాయి. నొండ్ల లక్ష్మారెడ్డికి చెందిన పశువుల కొట్టం పైనుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లపై రెండు పక్షులు కొట్లాడి పడటంతో మంటలు లేచి పశుగ్రాసంపై పడ్డాయి. పశుగ్రాసంతో పాటు పశువుల కొట్టం కాలిపోగా అందులోని పశువులను సమీపంలోని గ్రామస్తులు బయటకు పంపడంతో ప్రాణనష్టం తప్పింది. అలాగే పత్తిపాక పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి వడ్ల కుప్పలు అంటుకోవడంతో ఫైరింజన్‌కు సమాచారం అందించారు. ఫైరింజన్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. కాగా కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘం ఉపాధ్యక్షుడు పసునూటి శ్రీనివాస్ సందర్శించి నష్టం అంచనాలు అధికారులకు తెలియజేశారు. గంగారెడ్డికి చెందిన 15 వడ్ల బస్తాలు, ఐలయ్యకు చెందిన పరదాలు కాలిపోయినట్లు తెలిపారు. అగ్నిప్రమాదంపై సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అనుమానం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాన్ని ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్వహిస్తున్నందున గిట్టని వారు చేసిన పని కావచ్చని అన్నారు.

ప్రధాన నగరాలకు దీటుగా రామగుండం అభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: ప్రధాన నగరాలకు దీటుగా రామగుండం అభివృద్ధి చెందుతోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం ఆర్జీ–1 పరిధిలోని జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ఊపిరిగా సీఎం కేసీఆర్ ప్రజారంజక పాలన కొనసాగిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు సమైక్య పాలనలో సింగరేణి కార్మికులు న్యాయపరమైన హక్కులను కోల్పోయారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడ్డాక వారసత్వపు ఉద్యోగాలను కారుణ్య నియామకాల పేరుతో పునరుద్ధరించి కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. దీంతో సంస్థ వ్యాప్తంగా 16 వేల మంది యువత సింగరేణి కార్మికులుగా ఉద్యోగం పొందారన్నారు. గేట్ మీటింగ్‌లో నాయకులు కెంగర్ల మల్లయ్య, గండ్ర దామోదర్‌రావు, దూట శేషగిరి, పుట్ట రమేశ్, రాజేశం, శంకరయ్య, మోసిన్, ఫయాజ్, రామస్వామి, లింగన్న, రాజేష్, వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు సాగంటి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న గుజ్జుల సత్యనారాయణరెడ్డి

రామగుండం: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్గాం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం, మంత్రులు పర్యటించే సమయంలో ముందస్తుగా వివిధ పార్టీలకు చెందిన క్రియాశీలక ప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడితే రాబోయే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న తమ ప్రతినిధులు జూపాక శ్రీనివాస్, తోకల రమేశ్‌లను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న, పెండ్యాల రమేశ్, ఆడెపు శంకర్, రాములు, తేజేశ్వర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కూర రాజన్నను రాజ్యం చంపాలని చూస్తోంది

- అక్రమ కేసులు ఎత్తివేయాలి
- పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలి
- జనశక్తి జిల్లా నాయకుడు కిరణ్

సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనాయకుడు కూర రాజన్నను రాజ్యం చంపాలని చూస్తోందని జనశక్తి జిల్లా నాయకుడు కిరణ్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు రాజన్నపై నమోదు చేసిన అక్రమ కేసుల విషయంలో కోర్టుకు హాజరవుతూ.. కోర్టు షరతుల మేరకు వేములవాడలో ఉంటే.. రాజన్నను కలిసే వారిని పోలీసులు వేధిస్తున్నారని కిరణ్ ఆరోపించారు. అనారోగ్యంతో రాజన్న ఇద్దరు మనుషులు లేనిదే కదిలే పరిస్థితి లేదని.. 12 రకాల ఆపరేషన్లు అయ్యాయని పేర్కొన్నారు. రాజన్న పిటిషన్లతో కోర్టు కూడా షరతుల నుంచి మినహాయింపు ఇస్తే వేములవాడ పోలీసులు వేధిస్తున్నారని తెలిపారు. సిరిసిల్లకు చెందిన పోకల సాయికుమార్‌ను, వేములవాడకు చెందిన మానుక కుంటయ్యను అక్రమంగా అరెస్ట్ చేశారని, జనశక్తి రాజన్నకు సహకరిస్తున్నారనే తప్పుడు కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామికవాదులు, మేధావులు, పౌర సంఘాలు అక్రమ అరెస్టులను ఖండించాలని, పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కిరణ్ పిలుపునిచ్చాడు. అక్రమ కేసులను ఎత్తివేయాలని, ప్రజాసమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని అంబులెన్స్ డ్రైవర్ మృతి


హఫీజ్ మృతదేహం

గోదావరిఖని: మరికొద్ది క్షణాలైతే ఇంటికి చేరుకుంటాననే సమయంలో వాహనం రూపంలో వచ్చిన మృత్యువు నిండుప్రాణాన్ని బలితీసుకుంది. పదిమందికి ఆపద వస్తే ఆదుకునే అంబులెన్స్ డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పలువురిని కంటతడి పెట్టించింది. ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం విఠల్‌నగర్‌లో ఉంటున్న సయ్యద్ హఫీజ్(45) ఎన్టీపీసీ బీహెచ్ఈఎల్ కంపెనీలో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున డ్యూటీ ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో మున్సిపల్ చౌరస్తా జంక్షన్ సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదుట రాజీవ్ రహదారి దాటుతుండగా, మంచిర్యాల నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొంది. నడుము కింది భాగం కుడికాలు, తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఇంటికి వస్తాడన్న పెద్దదిక్కు అనుకోని విధంగా ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై స్వామి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా గుర్తుతెలియని వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు విచారణ వేగవంతం చేశారు. అతిత్వరలో పట్టుకుంటామని తెలిపారు. సొంత స్థలమైన రామగుండం విద్యుత్‌నగర్‌లో అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రీజినల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కంకరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యం, కాంట్రాక్ట్ అసోసియేషన్, జేఏసీ నాయకులతో జరిగే చర్చల్లో డిమాండ్లను పరిష్కరించని క్రమంలో యూనియన్ ద్వారా కార్మికుల పక్షాన న్యాయ పోరాటాలు చేయనున్నట్లు ప్రకటించారు. న్యూఢిల్లీలోని ఎన్టీపీసీ హెచ్ఆర్ డైరెక్టర్, సెంట్రల్ లేబర్ కమిషనర్, పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ, పవర్ మినిస్టర్‌లను కలిసి సమస్యను తెలియజేయనున్నట్లు తెలిపారు.

రైల్వే సిగ్నల్ కేబుల్ చోరీ నిందితుల అరెస్టు


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

రామగుండం: జగిత్యాల సమీపంలోని మల్యాల, నూకపల్లి రైల్వేస్టేషన్ల పరిధిలో రైల్వే సిగ్నల్ కేబుల్ చోరీ చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు రైల్వే సీఐ బుర్ర సురేశ్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం రామగుండం ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్టు వివరాలను వెల్లడించారు. మల్యాల, నూకపల్లి రైల్వే స్టేషన్ల పరిధిలో ఇటీవల పనులు జరుగుతున్న క్రమంలో సుమారు 500 మీటర్ల కాపర్ వైర్ డమ్ము చోరీకి గురైనట్లు గుర్తించామన్నారు. ఈమేరకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఏఎస్సై ఎం.శ్రీనివాస్, జైపాల్, బెనర్జీ, రోహితులు పది మంది నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. నేరం చేసిన వారిలో వెంకెపల్లికి చెందిన బండి కుమార్, కిరణ్, కిరణ్, బండి ఎల్లయ్య, మొగుళ్లపల్లికి చెందిన జగన్నాథుల రాజయ్య, ఎన్టీపీసీకి చెందిన కెంసారపు రాజయ్య, రవికుమార్, మల్లయ్య, పాలకుర్తి సంపత్, రామగుండంకు చెందిన నల్లగొండ స్వరూప, గోదావరిఖనికి చెందిన దొంతుల శ్రీనివాస్‌లు ఉన్నట్లు తెలిపారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

గోదావరిఖని: ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో మెడికల్ ఇన్వాలిడేషన్‌తో దిగిపోయిన 25 మంది కార్మికుల పిల్లలకు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఉద్యోగంలో అంకితభావంతో పనిచేస్తూ సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలన్నారు. ఆర్జీ–1 ఏరియాలో ఇప్పటివరకు 1,368 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. సింగరేణి భవిష్యత్ యువ ఉద్యోగుల చేతుల్లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, సీఎంఓఏఐ అధ్యక్షుడు పొనగోటి శ్రీనివాస్, జీఎం ఆఫీస్ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్, సీనియర్ పీఓ శ్రావన్‌కుమార్, నరేన్‌చక్రవర్తి, కందగట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విరిగిన వాటర్ ట్యాంకర్ వాహనం ఫ్రేమ్



విరిగిన వాటర్ ట్యాంకర్ వాహనం ఫ్రేమ్

కోల్‌సిటీ: రామగుండం నగర పాలక సంస్థకు చెందిన వాటర్ ట్యాంకర్ వాహనం ఫ్రేమ్ శుక్రవారం విరిగింది. ఆ సమయంలో ఎలాంటి వాహనాలు ఎదురుగా లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. గోదావరిఖని శారదానగర్ వాటర్ ట్యాంక్ నుంచి 5వేల లీటర్ల కెపాసిటీ కలిగిన వాటర్ ట్యాంకర్‌ను ట్రాక్టర్‌కు అనుసంధానం చేసి బయటకు తీసుకొస్తుండగా గ్రిల్స్ మీదికి రాగానే సడన్‌గా ట్యాంకర్ ట్రాలీ ఫ్రేమ్ విరిగిపోయింది. రహదారిపై ఈ సంఘటన జరిగి ఉంటే, భారీ ప్రమాదం సంభవించేదని ఉద్యోగులు భయంతో వణికిపోయారు.

సహకార సంఘాల బలోపేతానికి పెద్దపీట


సహకార సంఘం నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్

ఎలిగేడు: సహకార సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు అన్నారు. ఎలిగేడు మండలం దూళికట్టలో రూ.60లక్షల సహకార సంఘ నిధులతో నిర్మించిన నూతన భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 40ఏళ్ల క్రితం ఏర్పడ్డ సహకార బ్యాంకు అంచెలంచెలుగా ఎదుగుతూ మూడు బాక్కులున్న వ్యవస్థ 72 శాఖలుగా విస్తరించిందన్నారు. ఏ రాష్ట్రంలో చేయని విధంగా వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేస్తూ రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమచేస్తూ నంబర్ వన్ స్థానంలో నిలిచామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా రైతులకు ఏ కష్టం కలుగకూడదని సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్, నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కేడీసీసీ వైస్ చైర్మన్ రమేశ్, సీఈవో సత్యనారాయణరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రేణుక, డీసీవో విచల్‌బోస్, డీఈవో (నాబార్డు) జయప్రకాశ్, ఎంపీపీ స్రవంతి,, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.